


# కంట్రీ బ్రూట్

కరణం శేషపిళ్లై

డాక్టర్ సుమతి ఎంతో నాజూగ్గా-
దర్పంగా బస్సు ఎక్కింది.

ఊరి చివరవున్న పెద్ద బంగళాముందు రోజూ బస్సు ఆగడం, అక్కడికి యిరవై కిలోమీటర్ల దూరంలోవుండే పాలెంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తూన్న డాక్టర్ సుమతి ఆ స్టాపింగ్‌లో బస్సెక్కడం మామూలే. ఐతే ఈ రోజు మామూలుగా సుమతికి చోటు చూపలేదు కండక్టర్. కొత్తవాడు లాగుంది. తాను డాక్టర్నని తెలీదులాగుంది. అసహాయంగా అసహనంగా చుట్టూవున్న వాళ్ళని-ముఖ్యంగా కూచున్న వాళ్ళని శపించేందుకు సిద్ధంగావున్న మునికన్యలా అక్కసుతో చూడసాగింది సుమతి. తొక్కిసలాడుతూన్న జనం మధ్య సర్కస్ ఫీటు చేస్తూ నిలబడ్డం యాతనగా వుంది సుకుమారి సుమతికి. ఛీ.. ఛీ.. మేనర్‌లెస కంట్రీబ్రూట్స్! ఒకళ్ళకీ డాక్టరుగారు.... అందులో లేడీ డాక్టరు గారు నిలుచున్నారే అన్న యింగితంలేదు. ఈ దేశంలోని ప్రజలకి యింకెన్ని శతాబ్దాలకి మేనర్స్ తెలుస్తుందో! ఉన్నట్టుండి పక్కసీట్లో వున్న యిరవయ్యేళ్ళ అమ్మాయి పాపను చంకలోకి తీసుకొని పైకి లేచి తాను కూచున్న చోటు సుమతికి ఆఫర్ చేసింది. ఆ గుర్తింపుకు మురిసిపోతున్న సుమతి విజయ గర్వంతో ఓసారి అందరి వైపూ చూసి సీటులో కూచుని పట్టని చెమటను కర్చీఫ్‌తో తుడుచుకోసాగింది.

సాయంత్రం నాలుగు కావస్తోంది. అవుట్ పేషెంట్సు చాలా హడావుడిపడి పోతున్నారు. అరుచుకొంటూ తోసుకొంటున్నారు. కంట్రీ బ్రూట్స్ 'బాయ్' ఎంత చెబుతున్నా వినిపించుకోలేదు. సమాజం అట్టడుగునబడి నలిగిపోతున్న సామాన్య పౌరుడికోసం మెడిసిన్ చదివి పల్లెటూళ్ళలోని ప్రజల్ని ఉద్ధరించేందుకు బద్ధకంకణం కట్టుకున్న డాక్టర్లు, గవర్నమెంటు ఉద్యోగం వచ్చి హాస్పిటల్లో అడుగు పెడుతూనే రోగుల్ని ఈగల్లా చూడ్డం వింతేం కాదు. గుడి బయట క్యూలో దేవుడి దర్శనం కోసం కొట్టుకులాడే భక్తుల్లా ఓ.పి.లో ముసురుకుంటున్న రోగులు నిట్టూరుస్తున్నారు. డాక్టరు లోపల ఏం చేస్తూందో... ఎప్పుడు బయటికి వస్తుందో తెలియకుండా! లోపల చేంబర్స్‌లో డాక్టరు రావుగారితో డాక్టరు సుమతిగారు హస్కు కొడుతున్నారు. వాళ్ళ కులాసా కబుర్లల్లో ఈ నిట్టూర్పులు వినిపించలేదు. కిటికీ గుండా యెందుకో అలా చూసిన సుమతికి క్యూలో చివర.... అవును. ఆ అమ్మాయే....ఉదయం బస్సులో తనకు సీటిచ్చిన అమ్మాయే....ఎవరో ముసలాడ్ని పిలుచుకొచ్చినట్టుంది. తన్ను గుర్తించి కిటికీ దగ్గరకు వచ్చి అదోలా ఆశగా చూసింది తనకేసి.... సుమతి గిరుక్కున తల తిప్పుకొని మాటల్లో పడిపోయింది.

సాయంత్రం అయిదయింది.... తలుపులు తెరుచుకున్నాయి. డాక్టరు సుమతి పేషెంట్సు వైపు చూడకుండా చాలా

## మినీ కథా వీధి

చిరాగ్గా వెళ్ళిపోయింది. 'రేపు రండ్రా.' అని బాయ్ తాళం పెట్టి ఆమెను అనుసరించాడు.

రెండు గంటలు ఆలస్యంగా.. సరిగ్గా ఏడింటి కొచ్చిందిబస్సు. ఉదయానికిమల్లే కిటకిటలాడిపోతూన్నది. ఊళ్ళోని జనం అంతా బస్టాండులోనే ఎక్కేసి వుంటారు. ఖాళీలేదు. బస్సు లోపలికి అడుగెట్టిన సుమతికి మళ్ళీ ఉదయంలాగే సీటు దొరకలేదు. కండక్టర్ ప్రజా సేవలో మునిగిపోయినట్టున్నాడు పాపం. రెండు నిమిషాలు అటూయిటూ చూస్తూండిపోయింది సుమతి. మళ్ళా చిరాకు. కంట్రీ బ్రూట్స్.... ఎక్కడ కొంపలారపడానికో ఈ అలగా జనమంతా బస్సులెక్కేస్తారు. అరే! ఆ అమ్మాయే. పాపతో పక్కన ముసలాడ్తో కూచుంది ఎదుటి సీట్లో. తనవేపు చూస్తే చాలు. లేచి తన సీటు కాళీ చేసి యివ్వకున్నా మానె. కొద్దిగా సర్దుకొంటే ఈ చివర తాను ఎలాగో సర్దుకుంటుంది. లేకుంటే ఈ ఇరవై కిలోమీటర్లు యిలా నుంచొని ప్రతి కుదుపుకూ పైన పడుతూన్న మగాళ్ళ మధ్య వెళ్ళాలంటే- మైగాడ్! ఎంత యాతన! అదిగో ఆ అమ్మాయి తల పైకెత్తింది. గుడ్! ఈవైపే చూస్తుంది. మొహంలో చిర్నవ్వు....పరవాలేదు. తన మీద కోపం లేదు. హాస్పిటల్లో తన్ను పట్టించుకోనందుకు. ఆ అమ్మాయి చదువురాని మొద్దయినా ఎంతో మంచిదిలా వుంది. మేనర్స్ తెలిసినట్టుంది....వాట్! ఆ నవ్వు రెండు క్షణాల్లో అదోలా మారిందే. ఇంతలో పాపను తన ప్రక్కన కూర్చుండ బెట్టుకొని .... సీటునిండుగా సర్దుకు కూచుంది. పైగా చీదరించుకొన్నట్టు మొహం ఆ వైపు తిప్పుకుంది... ఇడియట్ ....కంట్రీ బ్రూట్!